ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 28 జనవరి 2025



సచివాలయాల్లో.. సమూల మార్పు

ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు

8



రెండు నెలల్లో రెండో డీఆర్సీ

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో నేడు డీఆర్సీ సమావేశం

◆ హాజరుకానున్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ◆ ఏటీఆర్‌పైనే అందరి దృష్టి ◆ ధాన్యం సేకరణతో పాటు అభివృద్ధి పనులే అజెండాగా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇన్‌చార్జి మంత్రులు తరచూ జిల్లాల్లో పర్యటించి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశించిన సంగతి తెలిసిందే. నవంబరులో జరిగిన డీఆర్సీలో పలు అంశాలు ప్రస్తావనకు రాగా పనుల పురోగతిని తదుపరి సమావేశం నాటికి చూపెట్టాలని మంత్రులు



ఆరబెట్టిన ధాన్యాన్ని గోతాల్లోకి ఎత్తుతున్న అన్నదాతలు (ఫైల్ ఫొటో)

అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వేదికగా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి అధ్యక్షతన జరగబోయే డీఆర్సీ ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు)కీలకం కానుంది. డీఆర్సీ సమావేశాలకు మధ్య కనీసం ఆరు నెలల కనీస గడువు ఉండడం అనే నిబంధనను పాటిస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వం అయితే ఏడాదికి కూడా డీఆర్సీ సమావేశం జరపకుండా దానిని ఓ ప్రహసనంగా మార్చేసింది. కానీ ఇప్పుడు మూడు నెలల్లోపే రెండో డీఆర్సీ సమావేశం జరుగుతుండడం వెనక ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల బాట పట్టాలనే సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలే పనిచేశాయనేదే సమాచారం.

ఏం చర్యలు తీసుకున్నారు

మంగళవారం జరగబోయే డీఆర్సీ సమావేశంలో గత సమీక్షలో లేవనెత్తిన అంశాలపై ఎలాంటి పురోగతి సాధించారో అనే అంశాన్ని ఏటీఆర్ పేరిట ఆయా విభాగాల అధికారులు సమావేశంలో నివేదించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వంలో ఏటీఆర్ ఊసే మరచి మొక్కుబడి తంతులా దీనిని నడిపించారు. కానీ గత సమావేశంలోనే ఏటీఆర్ అనేది డీఆర్సీ సమావేశాలకు గీటురాయి వంటిదనే అభిప్రాయాన్ని మంత్రులు వెలిబుచ్చారు. బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం, కాలువల్లో పూడికతీత, కీలకప్రాజెక్టుల్లో కదలిక వంటి అంశాలతో పాటు తుఫాన్ సాయం, గ్రానైట్ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, చీరాలలో టెక్స్‌టైల్ పార్కు వంటివన్నీ గత సమీక్షలో చర్చకు వచ్చాయి. వీటన్నింటిపై ఆయా విభాగాలు తీసుకున్న చర్యలను యాక్షన్ టేకెన్ రిపోర్టు రూపంలో సమావేశం ముందు వివరించాల్సి ఉంటుంది.

ప్రస్తుత అజెండా ఇదే...

జిల్లాలో ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం పూర్తి కావడంతో మద్దతు ధర విషయంలో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు ధర మరింతగా పతనమవడం కూడా ఆందోళన పరిచేదిగా ఉంది. ప్రభుత్వానికి 25,000 టన్నుల వరకు అదనంగా ధాన్యం సేకరణకు అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ 5,000 టన్నులకే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక దీనితో సరిపెట్టుకోవాల్సిందేననే సంకేతాలను ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పటికీ దాదాపు 70,000 టన్నుల ధాన్యం పొలాల మీదే ఉండడంతో పాటు మిల్లుల్లో కూడా వేల టన్నుల ధాన్యం నిల్వ చేసి ఉండ డంతో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర మీదే అన్నదాతలు ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా ఈ అంశమే డీఆర్సీ సమావేశంలో చర్చకు రానుంది. మరోవైపు బాపట్ల మెడికల్ కళాశాల పనుల ప్రారంభం విషయంలో నెలల తరబడి ఎలాంటి చలనం లేకపోవడంతో దాని నిర్మాణంపైన అనేక అపోహలు ప్రజల్లో ఉన్నాయి. ఇది కూడా డీఆర్సీలో ప్రముఖంగా చర్చకు రానుంది. అనేక పనులను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. వాటిని ఓ కొలిక్కి తేవడానికి తీసుకోవాల్సిన చర్యలు కూడా అజెండాలో భాగం కానున్నాయి. రీ సర్వే, రెవెన్యూ సదస్సుల్లో వేల సంఖ్యలో అర్జీలు రావడంతో వాటి పరిష్కారం పారదర్శకంగా జరుగుతుందా లేదా అనే అంశంతో పాటు తాజాగా మండలానికో గ్రామంలో జరుగుతున్న రీ సర్వేపై కూడా సమావేశంలో చర్చించనున్నారు.

పక్కా నివేదికలతో రండి

జిల్లాను అన్ని రంగాల్లో పురోగమన బాట పట్టించాలంటే డీఆర్సీ సమావేశమే అత్యంత కీలకమని గత సమీక్షలోనే ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లా మంత్రులు కూడా అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి పురోగతి నివేదికలతో పాటు, డీఆర్సీలో ఇన్‌చార్జి మంత్రి ఏ అంశం గురించి వివరాలు అడిగినా పక్కాగా ఇచ్చేలా నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆయా విభాగాల అధికారులను ఇప్పటికే కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు.

స్వల్ప వ్యవధిలో పెట్టడంపైనా సర్వత్రా చర్చ...

గతంలో దాదాపుగా ఎప్పుడూ కూడా ఇలా కేవలం మూడు నెలలు కూడా తిరక్కుండానే రెండో సారి డీఆర్సీ సమావేశం జరిగిన దాఖలాలు లేవు. ఏవైనా ప్రత్యేక పరిస్థితులు, అత్యవసర ఎజెండాలు ఉంటే తప్ప ఆరునెలల వ్యవధి అనేది సాధారణంగా ఉంటూ వస్తోంది. కానీ గతేడాది నవంబరు 5నే ఈ ప్రభుత్వంలో తొలి డీఆర్సీ జరగడం, మూడు నెలలు కూడా దాటకముందే మళ్లీ రెండో డీఆర్సీ జరగనుండడంతో నిబంధనలపై కూడా అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఇంత స్వల్ప వ్యవధిలోనే డీఆర్సీ మీటింగ్ జరపడం, జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు

రిసార్ట్ మోసాలపై పోలీసుల గురి



◆ సూర్యలంక హరిత బీచ్ రీసార్ట్ పేరిట సైబర్ వల
◆ బాధితుల్లో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే
◆ రెండు వారాల వ్యవధిలో 8 మంది ఉచ్చులో
◆ బయటపడని వారు మరెందరో
◆ నకిలీ వెబ్‌సైట్లపై డీజీపీకి లేఖ రాసిన ఏపీటీడీసీ
◆ సూర్యలంక రిసార్టు నుంచి వివరాలు తీసుకున్న డీజీపీ ఆఫీస్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకుని రెండు వారాల వ్యవధిలో 8 మంది సైబర్ మోసాల బాధితులుగా మిగిలారు. వీరంతా తెలంగాణవారే కాగా, వారాంతంలో ఆహ్లాదంగా బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సేద తీరాలనుకున్న వారు సైబర్ దొంగలు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడారు. బాధితులుగా బయటికొచ్చిన వారు 8 మంది కనబడుతుండగా, పదుల సంఖ్యలో ఈ మోసాల బారిన పడి బయటికి చెప్పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల క్రితం ఇదే తరహాలో సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట సైబర్ దొంగలు మోసాలకు పాల్పడ్డారు. అప్పుడు రిసార్టు నిర్వాహకులు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ దశలోనే ఆ కేసు నీరుగారిపోయింది. తర్వాత కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న సైబర్ నేరగాళ్లు మళ్లీ జనవరి నుంచి పర్యాటకులే లక్ష్యంగా, అది కూడా సూర్యలంక హరిత బీచ్ రిసార్టుపైనే ఎక్కువగా గురిపెట్టి పెద్ద ఎత్తున మోసాలకు

(మిగతా 8వ పేజీలో)

బాధితుల వివరాలు.. వారు నగదు బదిలీ చేసిన ఖాతాలు..


హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఈ నెల 12న సూర్యలంక హరిత బీచ్ రిసార్టులో గదులు బుక్ చేసుకోగా రూ.7,535 చెల్లించగా అది నకిలీ వెబ్‌సైట్ అని తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను కూడా సేకరించగా అది మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు తేలింది. ఈ వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు నిర్వాహకులకు బాధితుడు అందించారు. ఇదే నెల 14న మరో ముగ్గురు బాధితులు వెలుగులోకి వచ్చారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్ వాసులు కాగా, మరొకరు ఖమ్మం వాసి. వీరు నకిలీ వెబ్‌సైట్‌లో గదులుబుక్ చేసుకుని కుటుంబంతో కలిసి నేరుగా హరిత బీచ్ రిసార్టుకు రాగా మేనేజర్ అలాంటి బుకింగ్‌లేవీ జరగలేదని సమాధానమివ్వడంతో కంగుతినడం వారి వంత యింది. రూ.15,000 వరకు వీరు మోసపోయారు. వీరంతా కూడా బ్యాంకు ఖాతా వివరాలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫోన్ నంబరు తదితరాలతో సమగ్రంగా రిసార్టు నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ఏపీటీడీసీకి అందించగా, వాటిని డీజీపీ కార్యాలయంలో అందజేశారు. వాటి ఆధారంగానే విచారణ మొదలుపెట్టిన పోలీసులు తొలుత బ్యాంకు ఖాతా వివరాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. బాధితులు నగదు బదిలీ చేసిన ఖాతాలను బ్లాక్ చేయించే ప్రక్రియ నిబంధనల ప్రకారం ఇప్పటికే మొదలయింది. మరో వారం రోజుల్లో సైబర్ దొంగల ఆట కట్టిస్తామనే ధీమాను పోలీస్ శాఖ వ్యక్తం చేస్తోంది.



హరిత బీచ్ రిసార్టును పోలే విధంగా గదుల చిత్రం డిస్‌ప్లేలో ఫోన్ నంబర్

రూటు మార్చిన ఏపీటీడీసీ

సైబర్ మోసాల బాధితులు ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు ఇవ్వడానికి వెనకాడడం కూడా ఇన్ని రోజులూ సైబర్ దొంగలకు కలిసి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులుగా వచ్చేవారు తాము మోసపోయినట్లు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడానికి అంగీకారం తెలిపేవారు కాదు. మళ్లీ ఇటీవల వరుసగా సూర్యలంక హరిత బీచ రిసార్టు పేరిట సైబర్ మోసాలు వెలుగుచూడడంతో ఏపీటీడీసీ దృష్టి సారించింది. ప్రభుత్వ సంస్థ పేరుతోనే డీజీపీకి నేరుగా ఫిర్యాదు చేయడంతో సైబర్ దొంగల మూలాలను కూపీలాగే పనిలో పోలీస్ శాఖ ఉంది.



సకల జనుల వేదికగా మహోత్సవాలు

బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్



మహోత్సవాలకు హాజరైన భక్తులు



● ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

6

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

● అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 15 నుంచి 25 శాతం పెంపు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఒకటో తేదీ నుంచి నూతన చార్జీలు అమలులోకి వస్తాయి. భూముల మార్కెట్ విలువలపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో (మిగతా 8వ పేజీలో)



గుంటూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

బీసీల బంధువు టీడీపీ

● రాజకీయ, సామాజిక హోదా ఇచ్చింది
● బీసీల్లో ఆర్థిక విప్లవం కోసం మరింత కృషి ● జగన్ పాలనలో బీసీలందరికీ అవమానాలే... ● బీసీలకు పవర్ లేని పదవులతో అణగదొక్కిన వైసీపీ
● టీడీపీ బీసీ సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బలహీన వర్గాలైన బీసీ జన బంధువు టీడీపీ అని, బీసీల రాజకీయ, సామాజిక అభివృద్ధి టీడీపీ ఆవిర్భావంతోనే మొదలైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుల నేతృత్వంలో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో టీడీపీలోని బీసీ మంత్రులకు అభినందన సత్కార సభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 1982లో టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాలంటేనే భయపడే బీసీలకు పార్లమెంటు మెట్లు ఎక్కే వరకు టీడీపీ అభివృద్ధి బాటలు వేసిందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక హోదాతో పాటు ఆర్థిక పరిపుష్టత కూడా పొంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఇక్కడ జిల్లాల నుంచి ఢిల్లీ వరకు బీసీలకు అన్నీ అవమానాలేనని అన్నారు. పార్లమెంటులో తననే అవమానించేలా వైసీపీ ఎంపీలు వ్యవహరించారని గుర్తుచేశారు. నా బీసీలంటూ పవర్ లేని పదవులు ఇచ్చి అవమానించాడన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు పదవులు ఇచ్చినా వారందరూ జగన్, ఆయన పరివారం వద్ద తలవంచి, వారి ముంగిట కూర్చోవాల్సిందేనన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలకు దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉచిత కోచింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఆన్ లైన్‌లో కూడా డీఎస్సీ కోచింగ్ కార్యక్రమం ఏర్పాటు చే స్తున్నామన్నారు. బీసీల, ఎస్సీల ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రం లో 8 మంది మంత్రులు, 38 మంది ఎమ్మెల్యేలు, సీఎస్, డీజీపీ, టీటీడీ ఈవో ఎక్కడ చూసినా బీసీలే కనిపిస్తున్నారంటే ఇది బీసీ ప్రభుత్వం కాదా అని స్పష్టం చేశారు.

గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రూ. 3 లక్షలు నుంచి రూ. 3.5 లక్షలు ఇస్తే నా ఎస్సీ, నా బీసీ అనే జగన్ కేంద్ర ప్రభుత్వం రూ. లక్షన్నర ఇస్తే జగన్ కేవలం రూ. 30వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రావాల్సిన రూ. 74వేల కోట్లను దారి మళ్ళించి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. అలానే మాజీ సీఎం జగన్ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లను 33 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ఎంతో మంది బీసీల నాయకత్వానికి గండికొట్టాడని ధ్వజమెత్తారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన బీసీ బిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీ స్థాయికి వెళ్ళారంటే అది (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్

చివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పదవులు అలంకరణ కాదు.. బాధ్యత అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నీటి సంఘాల సభ్యులకు సూచించారు. సోమవారం స్థానిక కామేపల్లి కల్యాణ మండపంలో జలవనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా సాగునీరు అందేలా నీటి సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతతో ఇచ్చిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. సుమారు వెయ్యి మంది ఉన్న సాగునీటి సంఘాల సభ్యులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే దాదాపు 1.75లక్షల ఎకరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

గుండ్లకమ్మను ఎండబెట్టి.. ఇసుక దోపిడీ

గత ఐదేళ్లలో సాగునీటి వ్యవస్థను జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని గొట్టిపాటి విమర్శించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపించారు. గుండ్లకమ్మను ఎండబెట్టి, గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీకి పాల్పడిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే సరికి జంగిల్ తొలగింపు, కాలువల మరమ్మతులను పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని సాగునీటి సమస్యలను తెలుసుకుంటూ ఆ సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా అధికారులు, సంఘ సభ్యులు ప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ అధికారులతో పాటు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షల ఫీజు తేదీలు మార్పు

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ఫీజు చెల్లించుకునే గడువును మార్పు చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత అభ్యర్థులు ఫీజు చెల్లించుకోవచ్చునని సూచించారు. రూ. 100 అపరాధంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ను సంప్రదించాలని సీఈ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం పేరుతో రూ.5 లక్షలు వసూలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో హోం మంత్రి తానేటి వనిత సోదరుడు విజయ్ మోహన్ కుమార్ తనకు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 5 లక్షలు తీసుకొని మోసగించారని గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన చెలపాక రాజ్యలక్ష్మి సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ వెలువడిన సమయంలో తనకు తెలిసిన వారి ద్వారా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సత్యవతినగర్‌లో ఉంటున్న జొన్నకుర్తి విజయ్ మోహన్ కుమార్‌ను సంప్రదించానన్నారు. తన చెల్లెలు తానేటి వనిత హోం మంత్రిగా ఉందని, తప్పక కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడన్నారు. ఇందుకుగానూ 2022 డిసెంబరు 8న తన వద్ద నుంచి రూ. 5 లక్షలు తీసుకున్నాడని వివరించారు. ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు ఇవ్వాలని అనేక సార్లు తిరిగానన్నారు. డబ్బులు కోసం విజయమోహన్ కుమార్‌ను సంప్రదిస్తే తాను ఆ డబ్బు తన సిస్టర్‌కు ఇచ్చానని, హోం మంత్రిని కలవాలని చెప్పాడని అన్నారు. హోం మంత్రి తానేటి వనితను కలిస్తే తన సోదరుడిని కలవాలని చెప్పారన్నారు. ఈ విధంగా ఒకరిపై, ఒకరు చెప్పుకున్నారని, దీంతో అప్పటి పట్టాభిపురం సీఐ విజయ్ చంద్రకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనికి సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, న్యాయం చేయాలనీ, తనను మోసం చేసి తీసుకున్న డబ్బును ఇప్పించాలని బాధితురాలు పోలీసు అధికారులను వేడుకున్నారు.

సకల జనుల వేదికగా మహోత్సవాలు

- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సకల జనులకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలిచాయని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రధానంగా మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ ఇచ్చిన దైవ సందేశం భక్తులలో విశ్వాసాన్ని నింపింది. ఈ సందర్భంగా యేసు క్రీస్తు చేసిన అద్భుతాలను వివరించారు. ఆనాటి యెరికో పట్టణంలో అంధత్వం కలిగిన వ్యక్తి తనకు చూపు ప్రసాదించమని విశ్వాసంతో ప్రార్థించగా, అతని జీవితంలో ఏసుక్రీస్తు ప్రభువు అద్భుత కార్యాలు చేసినట్లు వివరించారు. తొలుత తూర్పుగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డి.సుధాకర్, కె.ఏసురత్నం, ఎన్. సత్యంబాబు, మహిమాకర్షణ కుమార్, సీహెచ్ షాలేము శరత్ తదితరులు దైవ సందేశాలు అందించారు. మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.సజీవరావు, ఫాదర్ ఎం.దేవదాసు, గవర్నింగ్ బాడీ సభ్యుల సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి.



మహోత్సవాలకు హాజరైన భక్తులు

హాజరైన ప్రముఖులు

బైబిల్ మిషన్ మహోత్సవాలకు సోమవారం వేమూరు ఎమ్మెల్యే ఆనంద్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు (మ్యాని) తదితరులు హాజరయ్యారు.

నేటి షెడ్యూల్ ఇలా..

బైబిల్ మిషన్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ధ్యానం, కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనల ఆలాపన, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, జాయింట్ సెక్రటరీ జె.ఆగమనరావు, సాయంత్రం జె.వినోద్ కుమార్, పాస్టర్లు జి.శామ్యూల్, వి.సతీష్ బాబు తదితరులు దైవ సందేశాలు అందిస్తారు.

'పరిష్కారమే ఎజెండా'తో మనోహర్ పాదయాత్ర

- 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' స్ఫూర్తితో ఒకే రోజు ప్రారంభం
- ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ..
- అధికారుల అక్రమాలపై సీరియస్

తెనాలి, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగారు... జనం సమస్యలు తెలుసుకున్నారు. అదే సమయంలో ఆయా వార్డుల్లో ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్యలపైనా దృష్టి పెట్టారు. సాధ్యమైన వాటికి అప్పటికప్పుడు పరిష్కారం చూపగా, దీర్ఘకాల సమస్యలకు ఒక నిర్దిష్ట సమయాన్ని కూడా అప్పుడే కేటాయించారు. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం స్ఫూర్తితో అదే రోజు మొదలు పెట్టడం సంతోషంగా ఉందంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి పట్టణంలోని వార్డుల్లో సోమవారం పర్యటించారు. మొదట ఐతానగర్‌లోని పేరంటాళ్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత 1, 2 వార్డుల్లో పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాతోపాటు 'ఆంధ్రజ్యోతి' కూడా ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడో మొదలు పెడదామనుకున్న కార్యక్రమం రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడుతూ వచ్చిందనీ, అయితే 'ఆంధ్రజ్యోతి' రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం వినూత్న కార్యక్రమం చేపట్టిన రోజునే మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు మీడియా కూడా తోడుంటే మరింత సమర్థంగా పరిష్కారం చూపగలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పత్రికలతో కలిసి నడవటానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ జనం వ్యక్తిగత సమస్యలతోపాటు, కాలనీల సమస్యలపైనా దృష్టిపెట్టారు. ఎక్కువగా ఇళ్లు, రేషన్ కార్డుల వంటి వ్యక్తిగత అంశాలు ఆయన ముందుకు వస్తే, ఎక్కువ మంది టిడ్కో ఇళ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాల సమస్యలపై ఏకరవు పెట్టారు. ఆయనతోపాటు పర్యటనలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఇతర జనసేన, టీడీపీ నాయకులు, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తర్వాత విలేకరులతో మంత్రి మనోహర్ మాట్లాడారు. తెనాలి పట్టణాన్ని ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం వంటివాటిలో స్కామ్ జరిగిందనీ, తెనాలిలో భారీ స్కామే జరిగిందని, రూ. వందల కోట్లు వెచ్చించి భూముల కొనుగోలుకు చూపిన శ్రద్ధ, కనీస వసతులు కల్పించటంలో చూపలేదన్నారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. ఇకపై నియోజకవర్గం మొత్తం పర్యటించి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందించుకుని నిర్దిష్ట సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఐతానగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్, పక్కన రాజకుమారి



డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

తాడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకూడదని, వారికి దూరంగా ఉండాలని డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి భవిష్యత్తు అంధకారమేనని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. సోమవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఈగల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో వారిని కూడా ఈగల్ శాఖలో భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు నియంత్రించడం ముఖ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్యాలు లేకుండా తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యార్థి ఈగల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలబారిన పడితే టోల్ నెం.1972కు తెలిపితే బాధితులకు కౌన్సిలింగ్ ఇచ్చి కాపాడతామన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు అయితే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. గంజాయి కేసులో అరెస్టు అయినవారు నేరస్తులుగా జీవితకాలం పాటు గుర్తింపు కలిగి ఉంటారన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని విద్యార్థులు పాల్గొన్నారు.



కేఎల్‌యూలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ నగేష్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పాదయాత్రతో చరిత్రను సృష్టించిన నారా లోకేష్

గుంటూరు(తూర్పు), జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు నవభారత్ నగర్‌లో క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రతో లోకేష్ పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చారన్నారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంతో రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయగలుగుతారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చి యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టేందుకు లోకేష్ కృషి చేస్తున్నాడని అన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావడమే కాకుండా ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా దావోస్‌లో పర్యటించారని అన్నారు. దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని చెప్పి కంపెనీలను ఏర్పాటు చేసేలా ఆహ్వానించారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులుతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న భాష్యం ప్రవీణ్, పాల్గొన్న కూటమి నాయకులు

రెస్టారెంట్ ధ్వంసంపై ఆందోళన

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి తమ రెస్టారెంట్‌ను ధ్వంసం చేశారని, ఇది స్థానిక టీడీపీ నాయకుని నిర్వాకమని బాధితులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరులో ఈనాడు రెస్టారెంట్ నిర్వహిస్తున్న గిరి కుమారస్వామి అనే వ్యక్తికి ఆదివారం అర్ధరాత్రి 12 సమయంలో టీడీపీ నాయకుడు కనగాల మధుసూదన ప్రసాద్ పలుమార్లు ఫోన్ చేసి దుర్భాషలాడాడని, కొద్ది సేపటి తరువాత వచ్చిన తన బావ పోతురాజు అతనికి ఫోన్ చేసి ఎందుకు ఫోన్ చేశావని అడుగగా మళ్లీ అదేవిధంగా దుర్భాషలాడటంతో పాటు రెస్టారెంట్‌ను కూడా ధ్వంసం చేస్తామని, చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఉదయం రెస్టారెంట్ వద్దకు వచ్చి చూడగా పూలకుండీలు, క్యాష్ కౌంటర్, అద్దాలు, ఇతర సామగ్రిని పెద్ద బండరాయితో పగులగొట్టడం గుర్తించామని, ఇది ఆ నాయకుని పనేనంటూ తన బంధువులతో కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో బైఠాయించి రాస్తారోకోకు దిగాడు. ఇటీవల ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపునకు టెండర్లు ఆహ్వానించిందని, రెండు దుకాణాలకు సంబంధించి తాము కూడా రెండు టెండర్లు వేశామని, ఆ రెండు టెండర్ నోటీసులు కూడా దౌర్జన్యంగా తీసేసుకున్నారని ఆరోపించారు. ఆందోళన చేస్తున్న సమాచారం అందుకున్న ఎస్ఐ ఏడుకొండలు తన సిబ్బందితో బస్టాండ్ సెంటర్‌కు వచ్చి బాధితుడితో పాటు ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. న్యాయం చేస్తానని చెప్పినప్పటికీ బాధితుడు వినలేదు. ఎస్ఐ నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, అతని అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రోడ్డుపై బైఠాయించిన రెస్టారెంట్ యజమాని, బంధువులు

'గ్రీన్ గ్రేస్' అక్రమాలను అరికట్టాలి

- డీఆర్ఎంకు నివేదించిన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ యాజమాన్యం తప్పుడు పద్ధతిలో భవన నిర్మాణ అనుమతులు, ఎన్‌వోసీలు పొందాలని ప్రయత్నిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నరేంద్ర పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వెళ్లి డీఆర్ఎం ఎం.రామకృష్ణతో సమావేశమై పలు అంశాలను ఆయనకు నివేదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ యాజమాన్యం అక్రమాలను గమనించి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరిగినా వాటికి బాధ్యత రైల్వేదే అవుతుందని హెచ్చరించారు. గతంలో రైల్వే నుంచి ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో ఐదు ఫ్లోర్ల అపార్ట్‌మెంట్‌నకు అనుమతులు పొంది తదనంతరం ఎలాంటి అనుమతులు లేకుండా 15 అంతస్తుల నిర్మాణం చేసినట్లు వివరించారు. దీనిపై సరైన నిర్ణయం తీసుకోకపోతే అమాయకులైన ప్రజలు నష్టపోతారని తెలిపారు. గుంటూరు నగర మాస్టర్ ప్లాన్‌లో ఉన్నటువంటి 60 అడుగుల రోడ్డును రైల్వే, జీఎంసీ కలిసి అప్రూవ్ చేసినటువంటి ప్లాన్‌లో చూపించలేదని అన్నారు. రైల్వే డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ తాము ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, రైల్వే నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి ఎన్‌వోసీలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో గతంలో ఇచ్చిన ఎన్వోసీని రద్దు చేశామని తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నిసార్లు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసినప్పటికీ అనుమతులు ఇవ్వమని చెప్పారు. జీఎంసీ మాస్టర్ ప్లాన్‌లోని 60 అడుగుల రహదారి రైల్వే వారిది కాదని, అది జీఎంసీ పరిధిలోనిదే అని డీఆర్ఎం చెప్పారు. త్వరలోనే గుంటూరు నాలుగు లైన్లుగా పరిణితి చెందబోతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జరిగే ప్రమాదాలకు ప్రజలు నష్టపోతారని, ప్రజలకు ప్రభుత్వానికి నష్టం చేకూర్చకుండా చూడడమే తమ బాధ్యతని తెలిపారు.



డీఆర్ఎంతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

బీసీల బంధువు టీడీపీ

(5వ పేజీ తరువాయి)

టీడీపీతోనే సాధ్యమైందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా తనకు పశ్చిమ టికెట్ ఇచ్చి బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపిన ఘనత టీడీపీ,సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. విజనరీ నాయకత్వం కలిగిన చంద్రబాబు సారధ్యానికి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చరిత్రాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్ నిర్మాణంతో పాటు రైతుల బకాయిలు రూ. 2 వేల కోట్లు విడుదల చేయటం, బీసీ సబ్ ప్లాన్ వంటి అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారధి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.



పూలదండతో సన్మానం

గుత్తికొండ అటవీప్రాంతంలో యువతిపై దాడి

పిడుగురాళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ అటవీ ప్రాంతంలో ఏకాంతంగా మాట్లాడుకునేందుకు వెళ్లిన ఓ జంట ఆ తరువాత మాట మాట పెరగడంతో, యువకుడు యువతిపై దాడికి పాల్పడిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా గుత్తికొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు గ్రామానికి చెందిన యువతి బీఫార్మసీ చదువుతుంది. యువతికి కారంపూడికి చెందిన మల్లికార్జునతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో వీరిద్దరు తరచూ గుత్తికొండ అటవీ ప్రాంతానికి వెళ్లి వస్తుంటారని సమాచారం. సోమవారం కూడా గుత్తికొండ అటవీ ప్రాంతానికి వెళ్లారు. యువతి వేరే వారితో ఫోన్‌లో మాట్లాడుతుందన్న అనుమానంతో వారిద్దరి మధ్య మాట మాట పెరిగి వాగ్వాదం జరిగింది. దీంతో యువతిపై దాడికి పాల్పడటంతో ఎడమకాలుకు తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పిడుగురాళ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య

పెదకాకాని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెదకాకానిలో వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని గ్రామానికి చెందిన వేములకొండ హారిక(17) అనే విద్యార్థిని నారాకోడూరు శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. అమ్మమ్మ వాణి, తాతయ్య కొండలరావు వద్ద ఉంటూ కళాశాలకు వెళ్తుంది. ఆర్నెల్ల క్రితం తాతయ్య కొండలరావు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హారిక మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో కళాశాలకు కూడా అప్పుడప్పుడు వెళ్లడం లేదు. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న రైలు బండి కింద పడి హారిక ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు మృతురాలు వేములకొండ హారికగా గుర్తించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

ఒకటి నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి : డీఎస్పీ

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి టూవీలర్‌పై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. డీఎస్పీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టూవీలర్ నడిపే వ్యక్తితోపాటు వెహికిల్ ఉన్న వెనుక ఉన్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేకుంటే మోటారు వెహికల్ చట్ట ప్రకారం చలానా విధిస్తామన్నారు. పోలీసు సిబ్బంది కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేనిపక్షంలో వారికి కూడా చలానాలు విధించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల టౌన్ సీఐ రాంబాబు, రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్


గద్దె సాంబశివరావు

బాపట్లరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని గణిత శాస్త్ర విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ గద్దె సాంబశివరావు పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్, గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ డి.రమేష్ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీని చేశారు. ఈసందర్భంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, యాజమాన్యం, సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఎయిడెడ్ పాఠశాలలకు డీఈవో నోటీసులు

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో 40మంది లోపు విద్యార్థులు ఉండే ఉపాధ్యాయులు ముగ్గురు కన్న ఎక్కువ మంది ఉన్న ఎయిడెడ్ పాఠశాలలకు గత మూడు సంవత్సరాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంపుదల చేయని కారణంగా పాఠశాల గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదు యాజమాన్యాలు వివరణ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం 29 ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలలో మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, సి.హెచ్ ప్రభాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

తెలుగు నాటక రంగ ఘనాపాటి కొర్రపాటి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నాటక రంగ ఘనాపాటి డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు అని, 130కు పైగా నాటికలు రాసి తెలుగు నాటక రంగాన్ని సుసంపన్నం చేశారని సినీ రచయిత, నవల రచయితగా పేరు ప్రఖ్యాతులు గడించారని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. కొర్రపాటి గంగాధరరావు 39వ వర్ధంతి కార్యక్రమంలో సోమవారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, డాక్టర్ శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ ఆయన అనేక సినిమాలకు రచనలు చేశారని, సినీ రచయతే కాకుండా వైద్యుడిగా కూడా మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. అనంతరం డి.సామ్యూల్, కామరాజు కాళిదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తిలు కొర్రపాటి గంగాధరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'యూపీఎస్ విధానంతో ఉద్యోగులకు భద్రత లేదు'

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : యూపీఎస్ విధానంతో ఉద్యోగులకు భద్రత లేదని ఏపీసీపీఎస్ ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ అన్నారు. వెల్లటూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న యునిఫైడ్ పెన్షన్ పథకం విధానం వల్ల ఉద్యోగులకు జీవన భద్రత లేదన్నారు. తమకు నచ్చిన పథకాలలో పొదుపు చేసుకునే స్వేచ్ఛ లేకపోవడం, పదవీ విరమణ సమయంలో దాచుకున్న మొత్తాల చెల్లింపులపై స్పష్టత లేకపోవడం ప్రధాన లోపమన్నారు. ఓపీఎస్, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా కంట్రిబ్యూషన్ లేని సేఫ్ పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ

రేపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించాలని విశ్రాంత ఉపాధ్యాయురాలు ఎం.కమలకుమారి అన్నారు. నిజాంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం 150 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సోమవారం స్టీలు కంచాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె.వనజాక్షి మాట్లాడుతూ తమ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు కమలకుమారి చేయూతనివ్వటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.సలీమ్, ఉపాధ్యాయులు ఏవీ నాగబసవయ్య, నాగరాజు, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చద్ది కార్యక్రమం

కర్లపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో ఉన్న గంగాగౌరి సమేత బధరికేదారేశ్వర స్వామి శివాలయంలో శివపార్వతులకు గురుస్వాములు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రావిరెడ్డయ్య లక్ష్మీ దంపతులు విశేష పూజలు, అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలను ఘనంగా నిర్వహించారు. శివస్వాములు 300 మందికి చద్ది కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివస్వాములు భక్తిగీతాలను ఆలపించి భజనలు చేశారు.

పేదలకు బియ్యం అందజేత

కర్లపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం పంచాయతీ దేవుని మాన్యంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు శ్రీ ఛత్రపతి శివాజీమహరాజు ఫౌండేషన్, బాపట్ల ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలను అధ్యక్షుడు పెనుమెత్స శివాజీరాజు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పెనుమెత్స నరసింహమూర్తిరాజు, పెనుమెత్స భార్గవ్, జయకృష్ణమోహనరెడ్డి, హనుమంతరావునాయుడు, మంతెన సుబ్బరాజు, మంతెన పృథ్వీరాజు, బాలు, రాజేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

● ఆరు నెలల పనులకు వెంటనే యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి
● సమావేశంలో ఎమ్మెల్యే ఆనందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డ్వామా పీడీ సువర్తను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదేశించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఉపాధి పనులపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన పనులు వివరాలను నివేదికల ద్వారా పరిశీలించారు. గోకులం పథకం ద్వారా లబ్ధిదారులు ఎంపిక విషయం, షెడ్ల నిర్మాణాలపై ప్రశ్నించారు. పీడీ సమాధానం ఇస్తూ 112 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, వారిలో 62 మంది షెడ్లు నిర్మాణాలు పూర్తి చేయగా 27 మంది పనులు ప్రారంభించారని, మరో 23 మంది అసలు పనులు ప్రారంభించలేదని తెలిపారు. పనులు ప్రారంభించని వారి విషయంపై మరొకసారి పరిశీలించి వెంటనే వారు షెడ్లు నిర్మాణం చేయకపోతే కొత్తవారికి కేటాయించాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీల విషయంపై 27 ఖాళీలకు గాను పది మందిని కొత్తవారిని నియమించడం జరిగిందని, మరో 17 మందిని నియమించాల్సి ఉందని తెలిపారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆనందబాబు ఆదేశించారు. రానున్న ఆరు నెలల కాలంలో ఐదు మండలాల పరిధిలో చేపట్టవలసిన ఉపాధి పనుల విషయంలో రైతులతో సంప్రదించి పనులను గుర్తించాలని, దీనిపై వారంలోగా యాక్షన్ ప్లాన్ తయారు చేసి పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల ఏపీవోలు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి


కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి


ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న పట్టణవాసి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను పరిష్కరించటంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకొని వినతిపత్రాలను పరిశీలించి కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారమార్గం కలెక్టర్ చూపించారు. పీజీఆర్ఎస్‌లో 121 అర్జీలు నమోదయ్యాయి. రెవెన్యూ సదస్సు, సర్వే గ్రామసభలలో వచ్చిన అర్జీలలో 3,400 అర్జీలు ఆడిటింగ్‌కు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి 100 శాతం పరిష్కరించాలని తెలిపారు. నిజాంపట్నం, మార్టూరు, కారంచేడు, జె.పంగులూరు, భట్టిప్రోలు, చీరాల మండలాలలో అర్జీలు సక్రమంగా ఆడిటింగ్ జరగలేదన్నారు. వాటిని పరిష్కరించకపోవటంపై ఆయన ఆరాతీశారు. పెండింగ్ అర్జీలపై పూర్తి స్థాయిలో ఆడిట్ చేయాలని, గడువులోగా పరిష్కరించాలని వీక్షణ సమావేశం ద్వారా మండలాధికారులను ఆదేశించారు. బాపట్ల, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీల పరిష్కారంపై ఒక టీమ్‌ని ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. గణతంత్ర వేడుకలు, హైటీ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ముఖ్యమంత్రి మూడో దఫా కలెక్టర్‌ల కాన్ఫరెన్స్ ఫిబ్రవరి రెండో వారంలో జరుగుతుందని అధికార సమాచారం అందినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో రెండు కాన్ఫరెన్స్‌లలో 36 శాఖలపై రెండురోజులపాటు సమీక్షలు జరగటం వలన జిల్లాపై పూర్తిగా వివరించే అవకాశం లభించలేదన్నారు. ప్రస్తుతం 36 శాఖల సెక్రటరీలు ప్రజంటేషన్ అంశాలను తయారు చేసి ముందుగా కలెక్టర్‌లకు అందజేస్తారని తెలిపారు. ఈనేపథ్యంలో సమస్యలు చెప్పుకోవటానికి, జిల్లా గురించి వివరించటానికి అవకాశం కల్పిస్తారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలతో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్‌గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ భట్టు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమ రిసార్ట్స్ తొలిగించాలని ఫిర్యాదు

బాపట్లరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గృహాల మధ్య ఉన్న అక్రమ రిసార్ట్స్‌ను తొలిగించాలని సూర్యలంక మత్స్యకార కుటుంబాలు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు, ఎస్పీకి వినతిపత్రాలను అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతూ విలేకర్లతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో 2019లో ఈ స్థలాలలో అనుమతులు లేకుండా అక్రమంగా రిసార్ట్స్‌లు నిర్మించారన్నారు. రిసార్ట్స్‌ల పరిసరాలలో మద్యం బాబులు తాగి రాత్రి సమయాలలో ఇళ్ళ వద్దకు వచ్చి తలుపులు తడుతూ అసభ్యంగా ప్రవరిస్తున్నారని తెలిపారు. వీరి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకుడు జేబీ శ్రీధర్ అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు అందించారు. రేపల్లె మండలం పోటుమెరకకు చెందిన ముత్తిరెడ్డి గుర్నాధరావుకి చెందిన సర్వేనెం.374/2ఏలో తమకు భూమిలేదని ఆన్‌లైన్‌లో తన పేరు చూపెడుతున్న నేపథ్యంలో ఆ భూమిని తొలిగించాలని కోరారు. పట్టణానికి చెందిన ఆలూరి తిరుపతికుమార్ తన ఇంటి స్థలాన్ని సర్వే చేసి సర్టిఫికెట్లను ఇప్పించాలని కోరారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన పాముల నాగేశ్వరరావు శ్మశానానికి భూమిని మంజూరు చేయాల్సిందిగా కోరారు. నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన అద్దేపల్లి శ్రీనివాసరావు ఇంటిపక్కన కొలసాని రామచంద్రయ్య వారి కుటుంబ సభ్యులు తమ మీద ఫిర్యాదులు చేస్తూ మానసికంగా హింసిస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని కోరారు. వీటన్నింటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ వెంకటమురళి


నూతన కలెక్టరేట్ ప్రతిపాదిత స్థలాన్ని జిల్లా అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతం పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతంలో కలెక్టర్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలో ప్రతి శనివారం స్వచ్ఛత దివాస్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. హెచ్‌ఆర్‌డీఏ భవనం, విస్తరణ శిక్షణా కేంద్రం, ఈటీసీ కార్యాలయ భవనాలు, సిబ్బంది విశ్రాంతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, ఖజానా శాఖ, రిజిస్ట్రేషన్ శాఖల కార్యాలయాల భవనాలను ఆయన పరిశీలించారు. ఆడిట్ శాఖ, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయం, ఇంటిలిజెన్సీ కార్యాలయం, డ్వామా, నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, పంచాయతీ శాఖ, అగ్నిమాపక, గృహనిర్మాణ, మత్స్యశాఖ కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం ఈటీసీకి చెందిన 6 క్వార్టర్స్ భవనాలు, నిరుపయోగంగా ఉన్న భవనాలు వినియోగంలోకి తెచ్చేలా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. 730 సర్వే నెంబరులో భూమి వివరాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆర్డీవోను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రతిపాదిత ప్రాంతమైన 57.13 ఎకరాల భూమిని సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని సర్వే ల్యాండ్స్ ఏడీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

● షెడ్యూల్ గెజిట్ విడుదల చేసిన కలెక్టర్
● ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ, 7న లాటరీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : గీత కార్మిక కులాలకు 10 శాతం మద్యం షాపులను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే దానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాగా షెడ్యూల్ గెజిట్‌ను కలెక్టర్ వెంకట మురళి విడుదల చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.దేవదత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 12 షాపులకు గాను 8 గౌడ కులస్థులకు, 4 గౌడ్‌లకు కేటాయించినట్లు వివరించారు. దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి మొదలవుతుందని, ఫిబ్రవరి 5తో గడువు ముగుస్తుందని, 7న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయడం జరుగుతుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్ తెలిపారు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే ప్రత్యక్ష ఆందోళన

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటంతో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. బాపట్ల ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు విషయంలో జోక్యం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తక్షణమే ఈ విషయంలో స్పందించి మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలురెడ్డి, యల్లావుల ఏడుకొండలు, నాయకులు దొంతిబోయన సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, గంగిశెట్టి రత్తయ్య, కొక్కిలిగడ్డ చెంచయ్య, పిన్నిబోయన ప్రసాద్, మండే విజయ్‌కుమార్, కటికల యోహోషువా తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రిషియన్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

రేపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఎలక్ట్రిషియన్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నీలా లక్ష్మణబాబు అన్నారు. జాతీయ ఎలక్ట్రిషియన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రేపల్లె ప్రైవేటు ఎలక్ట్రిషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రిషియన్ సంక్షేమానికి ప్రభుత్వం నిధిని ఏర్పాటు చేయాలని, అర్హులైన ప్రతి సభ్యుడికి రుణాలు, నివేశన స్థలాలు అందించాలని కోరారు.

తొలుత అంకమ్మ చెట్టు వద్ద నుంచి ఇసుకపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు అంకిరెడ్డి ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి గొర్రిపర్తి మణికంఠ, పఠాన్ షంషుద్దీన్, కోశాధికారి హరిదాసు భరత్‌కుమార్, గౌరవ సలహాదారుడు ఆలపాటి ఉదయ్‌భాస్కర్, శ్రీరామ్మూర్తి, అబ్దుల్ కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు దగ్గర పడుతున్నా స్టడీ మెటీరియల్ ఇవ్వరా?

● సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన జడ్పీటీసీ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వేమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షలు సమయం దగ్గర పడుతున్నప్పటికీ జిల్లా పరిషత్ ద్వారా ఏటా అందించే విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను ఇంతవరకు విద్యార్థులకు అందించకపోవడానికి కారణం ఏమిటని జడ్పీటీసీ గాజుల హేమలత విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో సోమవారం ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ మాట్లాడుతూ ఏటా మూడు నెలల ముందుగానే జిల్లా పరిషత్ ద్వారా స్టడీ మెటీరియల్‌తో పాటు అల్పాహారానికి సంబంధించిన నిధులు కూడా అందించడం జరిగేది అలాంటిది ఈ సంవత్సరం స్పందన లేకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ఎంఈవో వెంకటేశ్వరరావు సమాధానం ఇస్తూ ప్రభుత్వం ఏడాది ఎస్‌సీఆర్‌టీ ద్వారా పీడీఎఫ్‌లలో మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులకు పంపడం జరిగిందని దాని ఆధారంగా ప్రత్యేక క్లాసులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏపీఎం సత్యకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులకు ఆరు నెలల యాక్షన్ ప్లాన్‌ను తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో శివన్నారాయణ మాట్లాడుతూ, ప్రతి స్థాయిలోని ఉద్యోగి ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా పని చేయాలన్నారు. ఈవోపీఆర్‌డీ శేఖర్ మాట్లాడుతూ, కార్యదర్శులు ఇంటి పన్నులను మార్చి 1వ తేదీ కల్లా నూరుశాతం వసూలు చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ బాబ్జీ, పంచాయతీలు, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

● ప్రయాణికులకు ఇక్కట్లు


బస్సును లారీ ఢీకొనడంతో కరకట్టపై నిలిచి ఉన్న ప్రయాణికులు

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బస్సును లారీ ఢీకొనడంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. విజయవాడ నుంచి రేపల్లె వస్తున్న ఆర్టీసీ బస్సును సోమవారం ఉదయం కొల్లూరు నుంచి కరకట్టపై ఈపూరు వైపు వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో బస్సు సైడు భాగం దెబ్బతింది. దీంతో లారీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేసేందుకు బస్సు డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో బస్సులో ఉన్న ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు పలు ఇక్కట్లకు గురయ్యారు. కొల్లూరు కరకట్టపై జరిగిన ప్రమాదం వల్ల కరకట్టపై రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. బస్సు వెనుక వస్తున్న వాహనాలు ముందుకు వెళ్లే దారి లేకపోవడంతో ఆయా వాహనదారులు మళ్లీ వెనుతిరిగి ఈపూరు చిన్నకట్ట మీదుగా తమ గమ్యస్థానాలకు వెళ్లాల్సి వచ్చింది.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కోడిపందాల స్థావరంపై బాపట్ల పట్టణ పోలీసులు సోమవారం దాడి చేశారు. పట్టణ సీఐ రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణం రాజీవ్‌గాంధీకాలనీ వద్ద కోడిపందాలు నిర్వహిస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,080 నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైతులకు కేవైసీ తప్పనిసరి : ఎంపీడీవో

నగరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు ఎరువుల సబ్సిడీ వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా తమ కేవైసీ పూర్తి చేయాలని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు సూచించారు. సచివాలయ పరిధిలోని ప్రతి రైతుకు కేవైసీ ప్రాధాన్యతను వివరించాలని, తక్షణమే అవసరమైన పత్రాలను సమర్పించి కేవైసీ పూర్తి చేయాలని సచివాలయ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పింఛన్ లబ్ధిదారుల తనిఖీ కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

ప్రపంచ దేశాలు ఏపీ వైపు చూసేలా యువగళం పాదయాత్ర

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా, తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త తలెత్తుకునేలా యువగళం పాదయాత్రతో చరిత్ర సృష్టించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు నేటితో రెండేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పులకు కారణమైన ఈనాటి ప్రజా ప్రభుత్వం ఏర్పడటానికి జగన్ పార్టీ తుడిచి పెట్టుకుపోవటానికి సరిగ్గా రెండేళ్ళ క్రితం ఇదేరోజు యువగళం తొలి అడుగు పడిందన్నారు. నాటి వైసీపీ పాలకులు యువనేత యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు టీడీపీ నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టి రాళ్ళు విసిరినా, దాడులు చేసినా అదరక, బెదరక, యువగళం పాదయాత్రను ముందుకు తీసుకెళ్ళారన్నారు. చివరకు కూటమి ఘన విజయానికి కీలక పాత్రవహించారన్నారు. నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి విద్యార్థులను ఉన్నత మార్గంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు, ఏఐ టెక్నాలజీకి దేశంలో ఏపీని కేంద్రంగా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషి హర్షణీయమని ఎమ్మెల్యే కొనియాడారు.

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి : ఎస్పీ


అర్జీదారుని సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. గత నెల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న ఈపూరుపాలేనికి చెందిన మురళి ప్రసాద్ నడవలేని స్థితిలో ఉండి వీలు చైర్‌పై తన సమస్యను చెప్పుకోవటానికి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి రాగా ఎస్పీ స్వయంగా అర్జీదారుడి వద్దకు వెళ్ళి అతని సమస్యను విని ఇచ్చిన అర్జీని పరిశీలించారు. చట్టపరిధిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసానిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారానికి మొత్తం 51 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో మెడల్ సాధించిన కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ


నాగబ్రహ్మారెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్లరూరల్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది క్రీడలలో కూడా సత్తా చాటాలని, క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. చుండూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పిట్టు నాగబ్రహ్మారెడ్డి జనవరి నెలలో గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలలో సత్తా చాటి మెడల్స్ సాధించటంతో సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడి కానిస్టేబుల్‌ను అభినందించి స్విమ్మింగ్ పోటీలలో సాధించిన మెడల్స్ ప్రశంసపత్రాలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ నాగబ్రహ్మారెడ్డి స్విమ్మింగ్ పోటీలలో జాతీయ స్థాయిలో సత్తా చాటి నాలుగు మెడల్స్ గెలిచి జిల్లా ఖ్యాతి జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని సత్తా చాటాలని ఎస్పీ ఆకాంక్షించారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యం

● పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య


డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

రేపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో పాడిరైతులకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ ముందుకు వెళుతుందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య అన్నారు. సోమవారం కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదగా బహుమతి అందుకోవటంతో సిబ్బంది అభినందన సభను ఏర్పాటు చేసి ఏడీ నాంచారయ్యను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పశువులకు ప్రాణనష్టం జరగకుండా ప్రత్యేక చర్యలు, సొంత ఖర్చుతో 14 ట్రాక్టర్ల వరి గడ్డిని వరద ప్రభావిత ప్రాంతాల్లో పాడి రైతులకు అందించామని చెప్పారు. రానున్న రోజుల్లో రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో పాడి రైతులకు మెరుగైన సేవలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శివాజీ మృతి పార్టీకి తీరని లోటు

● ఎమ్మెల్యే ఆనందబాబు


కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలుపుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ క్రియాశీలక సభ్యుడు శొంఠి శివాజీ అకాల మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన శివాజీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సోమవారం పరామర్శించారు. సాగునీటి వినియోగదారుల సంఘం డైరెక్టర్‌గా ఎన్నికైన శివాజీ సుగుణశీలి అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, సాగునీటి సంఘం వైస్ చైర్మన్ డొక్కు శ్రీనివాసరావు, డైరెక్టర్లు కుంచె వెంకటేశ్వరరావు, యార్లగడ్డ పాండురంగారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుక్కల వెంకటేశ్వరరావు, ఆనంద్, కొలుసు పోతురాజు, ఇంతియాజ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు ఆరోగ్యశిబిరం

చెరుకుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గుళ్ళపల్లిలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించి 130 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు ఇచ్చామని డాక్టర్ బొలగాని జ్యోత్స్న తెలిపారు. బాపట్ల తెలుగు యువత అధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు, పంచాయతీ ఈవో జీ.మురళీకృష్ణ, ఎల్ఎస్ఏ శ్రీనివాసరెడ్డి, ఏహెచ్ఏలు అంకిత, హారిక, శ్రావణి, షరీఫ్, చైతన్య పాల్గొన్నారు.

ఏట్రవారిపాలెం సర్పంచ్‌కి ఘన స్వాగతం

కర్లపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏట్రవారిపాలెం పంచాయతీ గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలలో పాల్గొని ఉత్తమ పంచాయతీ సర్పంచ్ అవార్డు అందుకొని సోమవారం స్వగ్రామానికి తిరిగి వచ్చిన సందర్భంగా గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. వారికి పూలజల్లులతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మిర్చియార్డు సెక్రటరీగా చంద్రిక

● ఆంజనేయులుని రిలీవ్ చేసిన మార్కెటింగ్ శాఖ
● తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమండ్రికి రీబ్యాక్


చంద్రిక

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు (మిర్చియార్డు) సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా ఎ.చంద్రిక నియమితులయ్యారు. ప్రస్తుతం మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ప్రాజెక్టు అధికారిగా ఉన్న ఆమెను ఏడాది పాటు డిప్యూటేషన్‌పై మార్కెటింగ్ శాఖ నియమించింది. ప్రస్తుత కార్యదర్శి వి.ఆంజనేయులుని తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమహేంద్రవరం ఏఎంసీకి తక్షణం వెనక్కు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తూ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో చంద్రిక జీవీఎంసీలో రిలీవ్ అయి గుంటూరు మిర్చియార్డుకు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

తర్జనభర్జనలు జరుగుతూ...

ఇంచుమించు రెండు నెలలకు పైగానే మిర్చియార్డు సెక్రటరీ పోస్టింగ్‌పై ప్రభుత్వస్థాయిలో తర్జనభర్జనలు జరుగుతూ వచ్చాయి. తొలుత మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు యార్డులో వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాలపై ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం రూ. 436 కోట్ల ఆదాయం మిర్చియార్డు కోల్పోయిందని పేర్కొంటూ కొంత మంది అధికారులను బాధ్యులుగా చేసి రిపోర్టు ఇచ్చింది. దీని ఆధారంగా తొలుత అప్పటి మిర్చియార్డు సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డిని ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రటరీ వినుకొండ ఆంజనేయులుకు అదనపు చార్జ్ కేటాయించి గుంటూరు మిర్చియార్డులో నియమించింది. ఆయన గత నవంబరు నెలలో బాధ్యతలు స్వీకరించారు. కాగా డిసెంబరు నెలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్‌పీ సతీమణి చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ ఆమోద లెటర్ ఇచ్చింది. దాంతో మున్సిపల్ పరిపాలన శాఖ ఆమెని మిర్చియార్డు సెక్రటరీగా పోస్టింగ్ చేసేందుకు గత వారం ఎన్‌వోసీని జారీ చేసింది. దీని ఆధారంగా మార్కెటింగ్ శాఖ సోమవారం చంద్రికకు డిప్యూటేషన్‌పై మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పోస్టింగ్ కల్పించి అదనపు చార్జ్ నుంచి వినుకొండ ఆంజనేయులుని రిలీవింగ్ చేస్తూ జీవో ఆర్‌టీ నంబరు. 29ని జారీ చేసింది.

చివరి నిమిషం వరకు హైకోర్టులో పోరాటం

రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రెటరీగా ఉంటూ గుంటూరు మిర్చియార్డు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వినుకొండ అంజనేయులు చివరి నిమిషం వరకు ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నించారు. ఎప్పుడైతే చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారో ఆ విషయాన్ని తెలుసుకొని మార్కెటింగ్ కమిషనర్ ప్రొసీడింగ్‌పై ఆయన హైకోర్టులో కేసు వేశారు. చట్టం ప్రకారం మార్కెటింగ్ స్పెషల్ సీఎస్, కమిషనర్ నడుచుకొనేలా ఆర్డర్స్ పాస్ చేయాలని ఆయన అభ్యర్థించారు. అయితే హైకోర్టు తోసిపుచ్చింది.

మూడున్నరేళ్లలో వంతెనలు పూర్తి చేస్తాం



● నిర్మాణానికి రూ.41 కోట్లు కేటాయింపు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మొదటి ఏడాదిలోపు వంతెనల మంజూరు, రెండున్నర ఏళ్లలో నిర్మాణ పనులు, మూడున్నర ఏళ్ల లోపు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నాం' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పెదపలకలూరు ఎల్సీ నంబర్-6కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఢిల్లీలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరాభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళిక రచించామన్నారు. గుంటూరు జిల్లా వాసుల మూడు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ ఆర్‌వోబీ నిర్మాణానికి కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించుకోగలిగామని తెలిపారు. గుంటూరు నల్లపాడు సెక్షన్‌లోని పెదపలకలూరు (పుల్లడిగుంట - పేరేచర్ల రోడ్డు) ఎల్సీ నంబరు 6ను రైల్వే శాఖ ద్వారా మంజూరు చేయించుకున్నామని, ఈ నిర్మాణానికి రూ.41 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇప్పటిదాకా మంజూరైన ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు.



సచివాలయాల్లో.. సమూల మార్పు

● ఉద్యోగుల హేతుబద్ధీకరణతో సామర్థ్యం పెంపు
● మల్టీ పర్పస్, టెక్నికల్ విభాగాలుగా విభజన
● అవసరమైనవారికి సాంకేతిక శిక్షణ
● ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు

గ్రామ, వార్డు సచివాలయాల స్వరూపమే మారిపోతోందా.. అంటే అవుననే అనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాంతర వ్యవస్థగా మారి అస్తవ్యస్తంగా తయారైన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ లేకపోవడంతో కొంతమందిపై అధిక పనిభారం పడుతుంటే, మరి కొందరు చక్కగా తప్పించుకు తిరిగిన పరిస్థితి గడిచిన ఐదేళ్లలో కనిపించింది. దీనిపై కూటమి సర్కార్ దృష్టి సారించింది. సచివాలయాల సామర్థ్యాన్ని పెంచి, ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో సచివాలయాల్లో సమూల మార్పులు తెస్తోంది. ఉద్యోగుల హేతబద్ధీకరణ ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తోంది.



గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సచివాలయాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ప్రతి 2వేల మందికి ఒక సచివాలయం చొప్పున ఉండగా, దాన్ని కనీసం 2,500 జనాభా, 5 కిలోమీటర్ల దూరాన్ని ప్రామాణికంగా తీసుకుని మార్పులు చేస్తున్నారు. జనసాంద్రత, దూరాన్ని బట్టి 2,500 లోపు జనాభా, 2,500 నుంచి 3,500 జనాభా, 3,501 ఆపై జనాభా కింద సచివాలయాలను విభజించారు. దాంతో పాటు ఉద్యోగులను మల్టీ పర్పస్, టెక్నికల్, ప్రజా ప్రయోజన విభాగాల కార్యదర్శులుగా విభజించనున్నారు. 2,500 లోపు జనాభా ఉంటే ఇద్దరు మల్టీ పర్పస్ ఉద్యోగులు, నలుగురు టెక్నికల్ ఉద్యోగులు కలిపి మొత్తం ఆరుగురు ఉంటారు. 2,500- 3,500 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీ పర్పస్, నలుగురు టెక్నికల్ ఉద్యోగులు కలిపి ఏడుగురు, 3501 ఆపై జనాభా ఉన్న సచివాలయల్లో నలుగురు చొప్పున మల్టీపర్పస్, టెక్నికల్ ఉద్యోగులు వెరసి 8 మంది ఉంటారు. ప్రస్తుత విధానంలో ఒక్కో సచివాలయానికి 10 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ హేతుబద్ధీకరణ కారణంగా సగటున ఒక్కో సచివాలయానికి 7గురు ఉద్యోగులు సరిపోతారు.

ఉద్యోగుల హేతుబద్ధీకరణ..

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉ ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచివాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యోగులు మిగులుతారు. హేతుబద్ధీకరణతో అందరి ఉద్యోగుల సేవలు సామర్థ్యం మేరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

యాస్పిరేషనల్ కార్యదర్శులు..?

అదనంగా ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. వారి ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డ్రోన్ సాంకేతికతను గ్రామాల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. క్రమబద్ధీకరణ అనంతరం గ్రామ, వార్డు సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శి, ఒక వార్డు పరిపాలన కార్యదర్శులు ప్రధాన అధికారులుగా ఉండనున్నారు. సచివాలయాలను నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి కల్పన కార్యాలయాలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఉద్దేశం. మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. సచివాలయాల ద్వారా అందజేసే ధ్రువపత్రాలపై ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు.

ఆర్టీజీఎస్ కేంద్రాలుగా సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాలు రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయాలుగా పనిచేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇప్పటికే ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి సచివాలయ విభాగానికి అధిపతిగా ఉంటారు. సచివాలయాలు నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి, విలువ జోడింపు వంటి వాటికి కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ద్వారా కార్య నిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

హాజరు విధానంలో మార్పులు..

గతంలో సచివాలయ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు హాజరు నమోదు చేయాల్సి వచ్చేది. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలు, సాయంత్రం 5 గంటలకు హాజరు వేసిన వారికి మాత్రమే వేతనం విడుదల చేసేవారు. కొందరు క్షేత్ర విధుల పేరిట హాజరు వేయకుండా వేతనం తీసుకునేవారు. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు విధులకు గైర్హాజరయ్యేవారు. దీంతో మిగిలిన ఉద్యోగులపై పని భారం పడేది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రత్యేక యాప్‌లో ప్రతి రోజు ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే ఉద్యోగుల హాజరు తీసుకుంటారు. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం హాజరు వేసి సాయంత్రం వేయకపోతే సాధారణ సెలవుగా పరిగణిస్తారు. ఈ యాప్‌ను ప్రభుత్వం ఖజానా శాఖకు అనుసంధానం చేస్తారని తెలుస్తోంది.

రిసార్టు మోసాలపై.. పోలీసుల గురి

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యా టకాభివృద్ధి సూర్యలం క హరిత బీచ్ రిసార్టు పేరిట నకిలీ వెబ్‌సైట్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఈ నెల 16న ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ కార్యాలయం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ద్వారా బాధితుల వివరాలతో పాటు గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలతో సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పటికే నకిలీ వెబ్‌సైట్‌పై సైబర్ సెల్ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగా, బ్యాంకు ఖాతా వివరాలు జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయి ఉన్నారు

పెద్ద సంఖ్యలో పర్యాటకులు...

జిల్లాలో ఉన్న తీర ప్రాంత బీచ్‌లకు వారాంతాలతో పాటు వరుస సెలవుల వేళ కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరులో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం మంది రెండు వారాల ముందుగానే ఆన్‌లైన్ ద్వారానే రిసార్టులు బుక్ చేసుకుంటారు. వీరినే లక్ష్యంగా చేసుకుని సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. సైబర్ మోసగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఏడాది కాలం నుంచి వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ నకిలీ వెబ్‌సైటే వారికి ఆయుధంగా మారుతోంది. బ్యాంకుఖాతాలు, ఫోన్ నంబర్లు ఇవన్నీ తర్వాత దశలోనే. ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే వెబ్‌సైట్‌పై పర్యాటకులకు అవగాహన కల్పించడంలో గానీ, పెద్ద ఎత్తున ప్రచారం చేయడంలో కానీ వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది. పదేపదే సైబర్ మోసాలు వెలుగుచూస్తున్నా వాటిని కనిపెట్టడంలో సదరు విభాగాల నిర్లక్ష్యం కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏపీటీడీసీయే రంగంలోకి దిగి డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం మొదలైంది. జరిగిన మోసాల్లో అధికశాతం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిటనే జరిగినందున ఇక్కడ నుంచే పోలీస్ శాఖ విచారణ ప్రారంభించింది. ఇదే కాకుండా రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గదుల వివరాలు తెలుసుకోవడానికి హరిత బీచ్ రిసార్టుకు ఫోన్ చేసే వారిపై కూడా సైబర్ విభాగం దృష్టి పెట్టింది. వెబ్‌సైట్‌లో పెడుతున్న గదుల ఖాళీ వివరాలు, ఫోటోలు ఇవన్నీ కూడా హరిత బీచ్ రిసార్టు ఒరిజినల్ వెబ్‌సైట్‌తోనే పోలి ఉండడంతో ఆ దిశగా కూడా పోలీస్ శాఖ విచారణ ముమ్మరం చేసింది.

ఈవో సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు రంగం సిద్ధం


● చేయని ఖర్చులు చేసినట్టు చూపి రూ. రెండు కోట్లకు పైగా స్వాహా...
● కమిషనర్‌కు సమగ్ర నివేదిక అందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్


ఈవో సత్యనారాయణరెడ్డి

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిన చందంగా దేవాదాయశాఖ ఆదాయ, వ్యయాలకు కాపలాదారుగా ఉండాల్సిన ఆ శాఖ ఈవోనే వివిధ మార్గాల్లో సుమారు రూ. 2 కోట్లకు పైగా స్వాహా చేసినట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ జరిపిన సమగ్ర దర్యాప్తుల్లో ఆనాటి మందడపు టెంపుల్స్ ఈవో టీ సత్యనారాయణరెడ్డి అవినీతి బాగోతం వెల్లడైంది. ఆ ఈవో ఏ విధంగా దేవుడి సొమ్మును కైంకర్యం చేసింది అంశాల వారీగా నివేదిక అందించారు. ప్రస్తుతం ఈవో సత్యనారాయణరెడ్డి అక్కడ నుంచి బదిలీ అయి బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయ ఈవోగా కొనసాగుతున్నారు. అయితే రెండు, మూడు రోజుల్లో ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి. ఆయన మందడపు గ్రూపు టెంపుల్స్ ఈవోగా ఉన్న సమయంలో కళ్యాణోత్సవాలు, గ్రామోత్స వాలకు ఆయా దేవాలయాలు నోచుకోలేదు. అయినా రికార్డుల్లో మాత్రం రూ. 50 లక్షల 53 వేలకు పైగా ఖర్చు చేసి నాలుగు దేవాలయాల్లో ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించినట్టు లెక్కలు చూపటంతో ఉన్నతాధికారులు నిర్ఘాంతపోయారు. అంతే కాదు అయ్యగారు దేవుడు సొమ్మేగా అడిగేదెవరు అన్నట్టుగా సుమారు రూ.18.50 లక్షలకు ఓచర్లు కూడా లేకుండా ఖర్చు పెట్టినట్లు లెక్కల్లో చూపించారు. అంతే కాదు ఎటువంటి ముందస్తు బడ్జెట్ లేకుండా రూ.26.50 లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్లు వెల్లడైంది. ఇక పండుగలకు విద్యుత్ దీపాలు వేయించకుండానే ప్రత్యేకంగా వేయించినట్టు చూపటం, లేని ఉద్యాన వనాలను ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించి వాటి సంరక్షణకు రూ. లక్షల్లో ఖర్చు చేసినట్టుగా చూపినట్లు దర్యాప్తులో తేలింది. ఇక ఇదంతా ఒక ఎత్తు అయితే, తన ఇష్టానుసారంగా మూడు బ్యాంకుల్లో దేవాదాయశాఖకు చెందిన సొమ్మును మూడు ఎఫ్‌డీలలో ఉండగా కాలపరిమితి తీరకుండానే విత్ డ్రా చేయడాన్ని ఉన్నతాధికారులు పెద్ద నేరంగా భావిస్తున్నారు. విత్ డ్రా చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలా తీసుకోకుండా ఈవో చేసిన చర్య మూలంగా ఆ దేవాలయాలకు రావాల్సిన రూ. 7 లక్షల రూ. 34 వేలకు పైగా వడ్డీ రూపంలో నష్టపోయాయి. 2019లో విత్‌డ్రా చేయగా ఇప్పటి వరకు కూడా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోలేదు. అంతే కాదు ఇతని నిర్వాకం మూలంగా దేవుళ్ళు కూడా పన్ను ఎగవేతదారుల జాబితాలో చేరిపోయారు. గత ఐదేళ్ళు కూడా ప్రభుత్వానికి ఆలయాల ద్వారా చెల్లించాల్సిన పన్నులను చెల్లించకుండా ఇతని వ్యవహరించిన తీరు పట్ల కూడా ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నారు.

ప్రయోగాత్మకంగా పాప్‌కార్న్

● 92 రోజులకే చేతికి వస్తున్న పంట
● టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు
● నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్
● దళారులతో పని లేకుండా టన్ను రూ.22,500లకు కొంటామని భరోసా


పాప్‌కార్న్ మొక్కజొన్న పైరుకు నీటితడులు అందిస్తున్న టీడీపీ నేత మురళీ కృష్ణ

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాప్‌కార్న్ మొక్కజొన్న రకం నూతనంగా టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు చేపట్టారు. కొల్లూరు మండలంలోని కొల్లూరు, ఈపూరుతోపాటు జువ్వలపాలెం, తిప్పలకట్ట, కిష్కింద పాలెం తదితర లంక గ్రామాల్లోని రైతులు కూడా పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగును మురళీకృష్ణ సూచనల మేరకు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఓ సంస్థ నెలకొల్పింది. ఆ సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణను ఆశ్రయించి పాప్‌కార్న్ మొక్కజొన్నపై వివరించడంతో పాటు పంట దిగుబడులను టన్ను రూ.22,500లకు తామే కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. దీంతో ఆయన సాగు చేస్తున్న 80 ఎకరాలలో 40 ఎకరాలు పాప్ కార్న్ రకాన్ని విత్తి సాగు చేపట్టారు. ఇతర గ్రామాల్లో రైతులను కూడా ప్రోత్సహించడంతో వారు కూడా సాగు వైపు మొగ్గు చూపారు. పాప్‌కార్న్ విత్తనాలు అమెరికా నుంచి దిగుమతి అయ్యాయని, ఎకరాకు ఐదు కిలోల చొప్పున సంస్థ ప్రతినిధులు అందజేశారని టీడీపీ నేత తెలిపారు. పంటకు చీడ పీడలు ఆశించకుండా తీసు కోవా ల్సిన సస్యరక్షణ చర్యలతో పాటు అవసరమైన రసాయన మందులను కూడా సంస్థ ప్రతినిధులు సూచించడంతో పాటు అవసరమైన రైతులకు అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికే లంక గ్రామాల్లో సాగు చేసిన రైతులకు 3.5 టన్నులు దిగుబడులు వచ్చాయనీ, వాటిని సంస్థ ప్రతినిధులే కొనుగోలు చేసి నగదు చెల్లింపులు జరిపి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. దళారులు, మార్కెట్ ఒడుదొడుకులతో పని లేకుండా కంపెనీయే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా..

పాప్‌కార్న్ మొక్కజొన్న పంట ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు మురళీకృష్ణ పేర్కొన్నారు. సాధారణ మొక్కజొన్న పంట కాల పరిమితి 120 రోజులు కాగా, పాప్ కార్న్ మొక్కజొన్న పంట 92 రోజులకే చేతికి వస్తుందన్నారు. పైరు కూడా సాధారణ రకాల కంటే కొంచెం తక్కువ ఎత్తులో పెరుగుతుందన్నారు. దీనివలన ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతినే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. సాగు చేస్తున్న పంటను గమనిస్తూ నీటి యాజమాన్య పద్ధతులతోపాటు చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేయడంతో పాటు ఎరువులు కూడా సకాలంలో సరైన మోతాదులో పంటకు అందిస్తున్నట్లు చెప్పారు. పంట ఆశాజనకంగా ఉందనీ, తాను ఆశించిన మేర ఫలితాలు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తనతోపాటు కూలీలు కూడా శ్రమిస్తున్నారని చెప్పారు. వచ్చే దిగుబడులను బట్టి రైతులు పాప్ కార్న్ సాగుకు మరింత మంది మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.


ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న పాప్‌కార్న్ రకం మొక్కజొన్న పైరు

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

(5వ పేజీ తరువాయి)

నగర, పట్టణ, మండల శివారు ప్రాంతాల్లో స్వల్పంగా పెరుగుదల
బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తగ్గింపునకు నిర్ణయం

కసరత్తు చేసి ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. దీనిపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఏఏడి నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారని దానిని ఆన్లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే 2019 తర్వాత రూరల్ ప్రాంతంలో ఇంతవరకు భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్ లో కొంతవరకు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. దీంతో కొత్త జిల్లాలు ఏర్పాటైన ప్రాంతాల్లో కొంతమేర రిజిస్ట్రేషన్ చార్జీలు 2022లో పెరిగాయి. ఆ తరువాత 2023 లోనూ అక్కడక్కడ భూములలో సవరించారు ముఖ్యంగా ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా భూముల క్రయ, విక్రయాలు జరిగే గ్రామాలు, అదేవిధంగా బహిరంగ మార్కెట్లో భూముల మార్కెట్ విలువలు ఎక్కువగా పెరిగిన చోట కొంతమేర మార్కెట్ విలువలను పెంచారు. అయితే 2024లో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ తదితర అన్ని ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, పొన్నూరు తదితర అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపార వాణిజ్య కూడళ్ళలోనూ, ధనిక వర్గాలు ఉండే ప్రాంతాల్లోనూ భారీగా కాకపోయినప్పటికీ 15 నుంచి 25 శాతం మేర భూముల మార్కెట్ విలువలను పెంచబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్లలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పెరగబోతున్నాయో అంతే స్థాయిలో భూముల మార్కెట్ విలువలను యధాస్థితిలో కొనసాగించబోతున్నట్లు రిజిస్ట్రేషన్ అధికార వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా ఈ దఫా అనేక చోట్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూముల మార్కెట్ విలువలను తగించబోతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువలను తగ్గించాలంటూ ఎంతోకాలంగా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు, అలాగే ప్రభుత్వ మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని సబ్ రిజిస్ట్రార్ లు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని నిర్ణయించారు.



రియల్ రంగంపై పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఎంతో కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలతో సమానంగా ప్రభుత్వ మార్కెట్‌లో భూముల ధరలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు తప్ప, వ్యాపార పరంగా స్థలాలు, పొలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్స్ ఆలోచన లేకుండా ఒప్పంద పత్రాలకు పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా ఒప్పందాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆయా స్థలాల క్రయవిక్రయదారులు ఇబ్బందులు, కోర్టు వివాదాలు ఎదుర్కొంటున్నారు. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇవేమిపట్టవన్నట్లుగా భూముల మార్కెట్ ధరలు పెంచుకుంటూపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

టెక్నాలజీతో ప్రయోజనం

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ప్రయోజనాలు పొందవచ్చని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీఎల్‌ఎస్ఐ డిజైన్‌పై జరుగుతున్న మూడు రోజుల వర్క్ షాపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జగదీష్, ఈసీఈ విభాగాధిపతి డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్ కల్కి టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరుగుతుందని చెప్పారు. కల్కి టెక్నాలజీస్ నుంచి వివేక్, వారి ప్రతినిధుల ఆధ్వర్యంలో డిజైన్ ఫ్రంట్ అంట్ ఎండ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విధిగా శిక్షణలో పాల్గొనాలన్నారు. డా.డీవీఎస్ సుకన్య, కె.కవిత కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి పరిశుభ్రంగా ఉండేలా కావాల్సిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య కార్యక్రమాలు, అందుకు సంబంధించిన ప్రణాళికల తయారీ, పూర్తి స్థాయిలో గ్రామాలలో పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలు, తాగునీటి సరఫరా, ఇంటి పన్ను వసూలు వంటి పలు అంశాలపై చర్చించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల నుంచి చెత్త సేకరణ కార్యక్రమం ప్రతి రోజూ చేపట్టాలన్నారు. రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, నెలలో రెండు సార్లు తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, కార్యక్రమంలో ఈవో ఆర్‌డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో డబ్బు తీసుకొని మోసం

ఎస్పీకి బల్లికురవ మండలం పెదఅంబడిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు

బాపట్లరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ బల్లికురవ మండలం పెదఅంబడిపూడి గ్రామానికి చెందిన పోలవరపు సుబ్బారావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలోఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితుడు ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకరుల తో మాట్లాడుతూ తాను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్న సమయంలో అంజనారెడ్డి అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద నుంచి లక్షా30వేలు తీసుకున్నాడు. ఇప్పటికి ఒక సంవత్సరం దాటుతున్నా ఉద్యోగం ఇప్పించకపోగా ఎటువంటి సమాధానం చెప్పడంలేదన్నాడు. ఈవిషయంపై బల్లికురవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్పీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

నేడు వెంపరాల, సాధునగర్‌లో విద్యుత్‌కు అంతరాయం

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి రూరల్ ప్రాంతంలోని వెంపరాల, సాధునగర్ ఫీడర్‌ల మరమ్మతులకు సంబంధించి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. విద్యుత్ వినియోదారులు గమనించి సహకరించడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

బీసీల బంధువు టీడీపీ

(5వ పేజీ తరువాయి)

టీడీపీతోనే సాధ్యమైందన్నారు.

పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా తనకు పశ్చిమ టికెట్ ఇచ్చి బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపిన ఘనత టీడీపీ,సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. విజనరీ నాయకత్వం కలిగిన చంద్రబాబు సారథ్యానికి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చరిత్రాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్ నిర్మాణంతో పాటు రైతుల బకాయిలు రూ. 2 వేల కోట్లు విడుదల చేయటం, బీసీ సబ్ ప్లాన్ వంటి అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నా యుడు, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారధి, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.

ఈ క్రాప్ రికార్డులను పరిశీలించిన అధికారులు

పామూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలో తిరగలదిన్నె, మోపాడు, బొట్లగూడూరు, కంభాలదిన్నె, సిద్ధవరం గ్రామాల్లో 2024-25 రబీ సీజన్ పంటలను ఈ క్రాప్ చేసిన రికార్డులను కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఈవీ రమణ సోమవారం తనిఖీ చేశారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీ చేయించుకుంటేనే నష్టపరిహారం వస్తుందని చెప్పారు. అనంతరం జొన్న పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో కే రాధ, ఏఈవో నాగేష్, వీపీఏలు కల్యాణ్, సంతోష్, బాలకృష్ణ, రమేష్, హరికృష్ణలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1,18,580

సీఎస్‌పురం/పామూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోవిలంపాడు గ్రామంలో మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,18,580 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఈవో శ్రీగిరి రాజు నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.41,340, లడ్డు ప్రసాదం ద్వారా రూ.22,760, అన్నదానం విరాళాల ద్వారా రూ.54,480 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు?





నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్, పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్, వేటపాలెం బాలికోన్నత పాఠశాల రోడ్లు

- **ఆందోళనలో చిన్నారులు**
- **వేగానికి కళ్లెం వేయాలని వేడుకోలు**

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో పలు పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు వినిపిస్తున్నాయి. నిత్యం వాహనాల రద్దీతో రహదారులు రద్దీగా ఉంటున్నాయి. తరచూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో చిన్నారులు సైతం భయాందోళన చెందుతున్నారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్, గర్ల్స్ హైస్కూల్‌కు వందల సంఖ్యలో విద్యార్థుల సంఖ్య ఉంది. అయితే ఈ రెండు స్కూళ్లు చీరాల - బాపట్ల రోడ్డులో ఉండడంతో సైకిళ్లపై, కాలినడకన వెళ్లే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వేల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో ప్రయాణాలు సాగిస్తుంటాయి. కొద్దిసేపైనా రోడ్డు రద్దీ లేకుండా ఉండడం అరుదు. పైగా వాహనాలు నడిపే వారిలో మద్యం సేవించి, అతివేగంగా వాహనాలను నడపుతున్నారు. మరోవైపు ఆకతాయిలు కూడా పాఠశాలల సమీపంలో షాట్స్ పేలుస్తూ అసౌకర్య వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ సమీపంలో క్రమేపీ వాహనాలు విచ్చలవిడిగా మారాయి. అడ్డూఅదుపు లేకుండా వేగంతో వాహనాలు నడుపుతున్నారు. పైగా ఈ ప్రాంతంలో ఆటో స్టాండ్ కూడా నడుపుతున్నారు. దీంతో అక్కడ నిత్యం గందర గోళంగా ఉంటుంది. దీంతో విద్యార్థినులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. వేటపాలెం బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన రహదారిలో ఉంది. సమీపంలో పోలీస్ స్టేషన్, పలు బ్యాంకులు, వ్యాపార సముదాయాలు కూడా ఉండడంతో వాహనాల రద్దీ సాధారణంగానే అధికంగా ఉటుంది. రాకపోకలు చేసే బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్లపై వాహనాల వేగాన్ని నియంత్రించడంతోపాటు ఆకతాయిల చేష్టలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక

- **నేడు రూ.47.5లక్షల విలువైన సీసీ రోడ్లు ప్రారంభం**
- **ఎమ్మెల్యే కొండయ్య**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళిక ప్రకారమే అడుగులు వేస్తున్నామని ఎమ్మె ల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవాంగపురిలో రూ.47.5 లక్షలు విలువ గల సీసీ రోడ్లు ప్రా రంభోత్సవం చేయనున్నారు. ఈక్రమంలో ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. జాండ్రపేటలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించి సోమవారం ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దీనికి సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు.

పశువుల ఆరోగ్యం మెరుగునకు వైద్య శిబిరాలు




రామకూరులో గొర్రెలకు నట్టల నివారణమందు తాగిస్తున్న పశు వైద్యాధికారి... మేదరమెట్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

పంగులూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పశువులకు మెరుగైన వైద్యం అందించి పాడి పరిశ్రమను వృద్ధి చేసే లక్ష్యంగా గ్రామాలలో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నటు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని రామకూరులో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు సూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన గేదెలకు ఎద ఇంజక్షన్లను చేశారు. వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందచేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్, ఏహెచ్‌ఏలు ప్రమీలా బాయ్, ఏసోబు, భాగ్యజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : పశు పోషకులు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మేదరమెట్ల పశువైద్యాధికారి డాక్టర్ సైదయ్య తెలిపారు. సోమవారం మేదరమెట్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 80 పశువులకు పరీక్షలు చేసి, 600 గొర్రెలకు నట్టల మందు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సైదయ్య మాట్లాడుతూ పోషకులు సూచనలు పాటించడం వలన మెరుగైన పాలదిగుబడి సాధించవచ్చన్నారు. గొర్రెల కాపరులు వ్యాధులు సోకిన వాటిని మందకు దూరంగా ఉంచి, తగ్గేవరకూ మందులు వాడా లన్నారు. ప్రభుత్వ పథకాలను పోషకులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమం లో వైద్య సిబ్బంది, సహాయకులు, పశుపోషకులు, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

ద్రోణాదుల ప్రభుత్వ ఆస్పత్రి వాచ్‌మన్ ప్రవర్తనపై విచారణ



ఆసుపత్రి సిబ్బందిని విచారిస్తున్న విచారణ అధికారి డాక్టర్ శివచెన్నయ్య

మార్టూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్‌మన్, తోటిగా పనిచేస్తున్న బీ కుమార్‌పై జె.పంగులూ రు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శివ చెన్నయ్య విచారణ చేశారు. ఆయన సో మవారం ప్రభుత్వ ఆస్పత్రి కి వచ్చి కుమార్ పనితీరుపై విచారణ చేసినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు.. గత రెండేళ్ల నుంచి కుమార్ మద్యం తాగి విధులకు హాజరుఅవుతున్నారని, సక్రమంగా విధులకు రావడంలేదని, ఆస్పత్రిలో పనిచేసే మహిళా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తదితర విషయాలపై ఇటీవల సిబ్బంది డీఎంహెచ్‌వో విజయమ్మకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కుమార్ ప్రవర్తనపై సోమవారం శివచెన్నయ్య సిబ్బందితో మాట్లాడి వారిదగ్గర లిఖిత పూర్వకంగా వివరాలను సేకరించినట్లు తెలిసింది. ఈ విచారణ సమయంలో వైద్యాధికారులు డీ లహరి, రేష్మాలతో పాటు ఆస్పత్రి సీహెచ్‌వో ఆంజనేయులుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయంపై శివచెన్నయ్యను ఫోన్‌లో ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. విచారణకు వచ్చిన మాట వాస్తవమే నన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాలు మేరకు విచారణ చేశామన్నారు. ఆ వివరాలను, సిబ్బంది లిఖిత పూర్వకంగా కుమార్‌పై ఇచ్చిన ఫిర్యాదులను డీఎంహెచ్‌వోకు పంపిస్తామన్నారు.

రిసార్టు మోసాలపై.. పోలీసుల గురి

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యా టకాభివృద్ధి సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట నకిలీ వెబ్ సైట్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఈ నెల 16న ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ కార్యాలయం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ద్వారా బాధితుల వివరాలతో పాటు గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలతో సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పటికే నకిలీ వెబ్‌సైట్‌పై సైబర్ సెల్ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగా, బ్యాంకు ఖాతా వివరాలు జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయి ఉన్నారు

పెద్ద సంఖ్యలో పర్యాటకులు...

జిల్లాలో ఉన్న తీర ప్రాంత బీచ్‌లకు వారాంతాలతో పాటు వరుస సెలవుల వేళ కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరులో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం మంది రెండు వారాల ముందుగానే ఆన్‌లైన్ ద్వారానే రిసార్టులు బుక్ చేసుకుంటారు. వీరినే లక్ష్యంగా చేసుకుని సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు.

సైబర్ మోసగాళ్ల ఈ తరహా మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఏడాది కాలం నుంచి వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ నకిలీ వెబ్‌సైటే వారికి ఆయుధంగా మారుతోంది. బ్యాంకుఖాతాలు, ఫోన్ నంబర్లు ఇవన్నీ తర్వాత దశలోనే. ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే వెబ్‌సైట్‌పై పర్యాటకులకు అవగాహన కల్పించడంలో గానీ, పెద్ద ఎత్తున ప్రచారం చేయడంలో కానీ వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది. పదేపదే సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నా వాటిని కనిపెట్టడంలో సదరు విభాగాల నిర్లక్ష్యం కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏపీటీడీసీయే రంగంలోకి దిగి డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం మొదలైంది. జరిగిన మోసాల్లో అధికశాతం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిటనే జరిగినందున ఇక్కడ నుంచే పోలీస్ శాఖ విచారణ ప్రారంభించింది.

ఇదే కాకుండా రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గదుల వివరాలు తెలుసుకోవడానికి హరిత బీచ్ రిసార్టుకు ఫోన్ చేసే వారిపై కూడా సైబర్ విభాగం దృష్టి పెట్టింది. వెబ్‌సైట్‌లో పెడుతున్న గదుల ఖాళీ వివరాలు, ఫోటోలు ఇవన్నీ కూడా హరిత బీచ్ రిసార్టు ఒరిజినల్ వెబ్‌సైట్‌తోనే పోలి ఉండడంతో ఆ దిశగా కూడా పోలీస్ శాఖ విచారణ ముమ్మరం చేసింది.



కలెక్టర్ ద్వారా షీల్డ్‌ను అందుకుంటున్న విద్యార్థిని దివ్య

ప్రతిభ చాటిన బూదవాడ విద్యార్థులు

పంగులూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీలలో ప్రతిభచాటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు. గత ఏడాది అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత శాఖ వీరగాథ 4.0 ఆన్‌లైన్ పోర్టల్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాల పదవ తరగతి విద్యార్థిని భవనం దివ్య 1857 సిపాయిల తిరుగుబాటు అనే అంశంపై సమర్పించిన వ్యాసం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. దివ్యకు ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకలో కలెక్టర్ ప్రశంసాపత్రం అందచేశారు. ఇదే పాఠశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచనలో నందవరపు యాస్మిన్ మూడో స్థానం, వక్తృత్వ పోటీలో కొమ్మారెడ్డి జగన్మోహనరెడ్డికి ద్వితీయ స్థానం, క్విజ్ పోటీలో నందవరపు యాస్మిన్, కొమ్మారెడ్డి జగన్మోహనరెడ్డికి ద్వితీయ స్థానం దక్కి కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నాగరాణి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ అలవల వీరారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

(5వ పేజీ తరువాయి)

కసరత్తు చేసి ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. దీనిపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఏపడి నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారని దానిని ఆన్లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే 2019 తర్వాత రూరల్ ప్రాంతంలో ఇంతవరకు భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్ లో కొంతవరకు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. దీంతో కొత్త జిల్లాలు ఏర్పాటైన ప్రాంతాల్లో కొంతమేర రిజిస్ట్రేషన్ చార్జీలు 2022లో పెరిగాయి. ఆ తరువాత 2023 లోనూ అక్కడక్కడ భూములలో సవరించారు ముఖ్యంగా ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా భూముల క్రయ, విక్రయాలు జరిగే గ్రామాలు, అదేవిధంగా బహిరంగ మార్కెట్లో భూముల మార్కెట్ విలువలు ఎక్కువగా పెరిగిన చోట కొంతమేర మార్కెట్ విలువలను పెంచారు. అయితే 2024లో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ తదితర అన్ని ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, పొన్నూరు తదితర అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపార వాణిజ్య కూడళ్ళలోనూ, ధనిక వర్గాలు ఉండే ప్రాంతాల్లోనూ భారీగా కాకపోయినప్పటికీ 15 నుంచి 25 శాతం మేర భూముల మార్కెట్ విలువలను పెంచబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్లలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పెరగబోతున్నాయో అంతే స్థాయిలో భూముల మార్కెట్ విలువలను యథాస్థితిలో కొనసాగించబోతున్నట్లు రిజిస్ట్రేషన్ అధికార వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా ఈ దఫా అనేక చోట్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూముల మార్కెట్ విలువలను తగ్గించబోతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువలను తగ్గించాలంటూ ఎంతోకాలంగా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు, అలాగే ప్రభుత్వ మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని సబ్ రిజిస్ట్రార్ లు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని నిర్ణయించారు.

రియల్ రంగంపై పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రియల్ వేస్టేట్ రంగం ఎంతో కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలతో సమానంగా ప్రభుత్వ మార్కెట్‌లో భూముల ధరలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు తప్ప, వ్యాపారపరంగా స్థలాలు, పొలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్స్ ఆలోచన లేకుండా ఒప్పంద పత్రాలకు పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా ఒప్పందాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆయా స్థలాల క్రయవిక్రయదారులు ఇబ్బందులు, కోర్టు వివాదాలు ఎదుర్కొంటున్నారు. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇవేమిపట్టవన్నట్లుగా భూముల మార్కెట్ ధరలు పెంచుకుంటూపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా చూడాలి : డీఈవో

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు రోజుల తరబడి రాకుండా ఎక్కువ రోజులు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారు పాఠశాలకు వచ్చేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం సూచించారు. సోమవారం ఆయన అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని రికార్డులను, పిల్లల హాజరు రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగాధర్, సుధాకరావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలికల విద్యకు ప్రోత్సాహం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
- రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ సాయంతో విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ
- త్వరలో మరో 10వేల మందికి అందజేత


విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8, 9 చదువుతున్న విద్యార్థినులకు మంత్రి నిధులు, నెదర్లాండ్స్ రోటరీ క్లబ్, దాతల సహకారంతో సమకూర్చిన సైకిళ్లను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలికలందరూ చదువుకోవాలన్న సదుద్దేశంతోనే వారిని ప్రోత్సహించేందుకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుక బడిన ప్రకాశం జిల్లాలో ఎక్కువ మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటున్నారని, వారు గ్రామాల నుంచి పట్టణాలకు రావాలంటే సరైన రవాణా సౌకర్యంలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి చదువుకు ఆటంకం కలుగకుండా ఉండేందుకు సుమారు 40 ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సైకిళ్లను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు.

రూ.5కోట్లతో పదివేల సైకిళ్ల పంపిణీ

ప్రస్తుతం 8, 9 తరగతులు చదువుతున్న బాలికలకు సైకిళ్లు ఇచ్చామని, ఇక్కడ పరిస్థితి చూస్తే 6, 7 తరగతుల విద్యార్థినులకూ సైకిళ్లు అవసరంగా గుర్తించామని మంత్రి తెలిపారు. వారికి కూడా త్వరలో సైకిళ్లను అందిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సుమారు పది వేల సైకిళ్లు అవసరమని, వాటిని ఏడాదిలో అందిస్తామని తెలిపారు. తన సొంత నిధులతో పాటు రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ వారి సహాయం, దాతల సహకారంతో బాలికలందరికీ సైకిళ్లు సమకూర్చుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు సుమారు రూ.5కోట్లకు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. తరగతి గదులు అదనంగా కావాలని పాఠశాల యాజమాన్యం కోరగా త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు, రోటరీ నెదర్లాండ్స్ ప్రతినిధులు లియో జ్వాగ్ మేకర్, కీస్ వాన్డెన్ బెర్గ్, కోన్ వెస్సర్, వివిధ శాఖల అధికారులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లకు రూ.5.50కోట్ల నిధులు

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి దృష్టి

పర్చూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజవకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే నియోజవర్గంలో రూ.24కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మించగా, తాజాగా సోమవారం మరో రూ.5.50కోట్లతో సీసీ రోడ్లతోపాటు, డ్రైన్‌లను ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ డీఈఈ ఆదినారాయణ తెలిపారు. అందులో పర్చూరు మండలం నాగులపాలెంకు రూ.41.35లక్షలు, తిమ్మరాజుపాలెంకు రూ.25లక్షలు, వీరన్నపాలెంకు రూ.25లక్షలు, అడుసుమల్లి రూ.10లక్షలు, పర్చూరుకు రూ.14లక్షలు, ఇనగల్లుకు రూ.35లక్షలు, కొమర్నేనివారిపాలెంకు రూ.10లక్షల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. అలాగే కారంచేడు మండలంలోని ఆయా గ్రామాలకు రూ.75లక్షలు, ఇంకొల్లుకు రూ.1.05కోట్లు, యద్దనపూడికి రూ.1.15కోట్లు, మార్టూరుకు రూ.95లక్షలు మంజూరయినట్లు తెలిపారు.


కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో దెబ్బతిన్న నేల చప్టా

ప్రమాదకరంగా చప్టా

- కొణిదెన - ఉప్పుమాగులూరు రోడ్డులో ప్రయాణమంటేనే హడల్
- ఆందోళనలో ప్రయాణికులు

బల్లికురవ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొణిదెన ఉప్పుమాగులూరు రోడ్డులో నేల చప్టా ప్రమాదకరంగా తయారైంది. చప్టాపై సిమెంట్ మెత్తం లేచి పోయి బద్దబద్దలుగా పగిలి పోవడంతో వాహన చోదకులు ఈ మార్గంలో ప్రయణం అంటేనే హడలి పోతున్నారు. రాత్రి సమయంలో ఎవరైన ఈ మార్గంలో వస్తే ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలకు రాళ్లను రవాణా చేసే వాహనాలు చప్టా వద్దకు వచ్చి కురుకు పోతున్నాయి. ఇంతటి ప్రమాదంగా ఉన్న చప్టా గురించి ఎవరు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రైతులు అయితే పోలాలకు ఈ చప్టా మీదగా వెళ్ల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నేల చప్టాను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

బాధ్యతగా వాహనాలు నడపాలి


హెచ్చరిక డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి ఆధారంగా ఉన్న యజమాని బాధ్యతగా వాహనాలు నడపాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సోమవారం వేటపాలెం స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో పలుచోట్ల ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్సై వెంకటేశ్వర్లుతో కలిసి డ్రమ్ములు, హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తరచూ సాధారణంగా మారాయన్నారు. ప్రమాదాంతో కుటుంబంలో వ్యక్తులను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుందన్నారు. ఈక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలన్నారు. అధికారులు వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు. ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

పది పరీక్షలపై జాగ్రత్తలు పాటించాలి


స్టడీ మెటీరియల్‌తో పదవ తరగతి విద్యార్థులు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రత్యేక జాగ్రత్తలను పాటించి రాణించాలని వేటపాలెం మండలం అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భవనం బద్రిరెడ్డి అన్నారు. మార్చిలో పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ద్వారా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పరీక్షలను ఇష్టంతో రాయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాల సుబ్రహ్మణ్యం, కమరున్నీసాబేగం పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న అద్దంకి ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ సభ్యులు

ఘనంగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ దినోత్సవం

అద్దంకిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ యూనియన్ దినోత్సవాన్ని స్థానిక కార్యాయలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పూండ్ల శ్రీనివాసరావు, గుండిమెడ వెంకట సుబ్బారావు, అద్దంకి హరిబాబు, ఏడుకొండలు, నాగార్జున, జైరావు, శ్రీనివాసరావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఆర్అండ్ పీఎం, జాండ్రపేట హైస్కూల్, వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట హైస్కూల్, వేటపాలెం ఎంపీపీ స్కూళ్లను ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో భాగంగా పాఠశాలల్లోని అటెండెన్స్ రిజిస్టర్, వంట గది తదితర వాటిని ఆర్డీవో పరిశీలించారు, విద్యార్థులో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాలకు భిన్నంగా మోసపూరిత వ్యవహారాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఆర్డీవో హెచ్చరించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆయనవెంట కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేటపాలెం (చీరాలటౌన్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. చినగంజాం మండలం కడవకుదురు నుంచి వేటపాలెం మండలం పాపాయిపాలెంకు వెళుతున్న పోత ఇసుక టిప్పర్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

యద్దనపూడి (మార్టూరు), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం యద్దనపూడి మండలం గన్నవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు టీడీపీ నాయకులు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చుండి లక్ష్మీనారాయణమ్మ, రంగయ్యచౌదరి పాల్గొన్నారు.

రైతుల హామీల అమలులో కేంద్రం విఫలం

ఇంకొల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరావు అన్నారు. రైతులు, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ చీకటి చట్టాలను రద్దు చేస్తామని చెప్పి, వాటిని రద్దు చేయకుండా అమలు చేసి రైతుల హక్కులను కాలరాయాలని చూస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, గోవిందరాజులు, నార్ని సింగయ్య, మాదాల అంజయ్య, బొగ్గవరపు శంకర్, బాచిన కోటేశ్వరరావు, చిలుకూరు శ్రీనివాసరావు, దర్శి సుబ్బారావు పాల్గొన్నారు.